జూనియర్ జడ్జిగా ఎంపికైన విద్యార్థినికి సన్మానం

తేజస్వినిని సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

నవాబ్‌పేట, డిసెంబర్1: ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన నవాబ్‌పేట ఎంఈవో నాగ్యానాయక్ కూతురు తేజ స్వినిని పీఆర్‌టీయూ టీఎస్ మండల నాయకత్వం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. చిన్న వయస్సులోనే పెద్ద పోస్టుకు ఎంపిక కావడంపై పలు యు సంఘం బాధ్యులు, ఉపాధ్యాయులు, మేధావులు ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యాదయ్య, విజయ్‌కుమార్‌గౌడ్, సంఘం ప్రతినిధులు సదాశివుడు, కృష్ణయ్య, ఓంప్రకాశ్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

సుప్రభాత్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న సుప్రభాత్ హెల్త్ క్లబ్ సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 1: జిల్లా కేంద్రంలోని బాయ్స్ జూనియర్ కళాశాల మైదానంలో సుప్రభాత్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ –స్వచ్ఛ పాలమూర్ కార్యక్రమం నిర్వహించారు. మైదానంలోని పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తను తొలిగించి చీపుర్లతో యోగా మందిరం, వాకర్స్ ట్రాక్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సుప్రభాత్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు పాడురంగం, బాయ్స్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతాచారి మాట్లాడుతూ.. మన ఇల్లును ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో క్రీడా మైదానాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి వాకర్స్‌పై ఉందని పేర్కొన్నారు. అనంతరం వాకర్స్, క్రీడాకారులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కృష్ణమోహన్, యాదిరెడ్డి, వెంకటాంరెడ్డి, శంకరయ్య, సుగుణ, శాంతమ్మ, శ్రీనివాసులు, నర్సింహులు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలను తరలించడం తగదు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మరికల్, డిసెంబర్ 1: మండలంలోని చిత్తనూల్‌లో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను నిర్మించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. మరికల్ మండలంలోని చిత్తనూర్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి అధికారులు సర్వే చేశారని, ఎమ్మెల్యే సొంత మండలమనే ఉద్దేశంతో ధన్వాడ మండల కేంద్రానికి పాఠశాలను తరలించడం తగదన్నారు. అధికారులు సర్వే చేసిన విధంగా మరికల్ మండలంలోనే ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణ, వీర బసంత్, జగదీశ్, నర్సింహులు, కొండన్న, రాజారెడ్డి, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి భగవద్గీత శ్లోకాలను నేర్చుకోవాలి

భగవద్గీత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మరికల్, డిసెంబర్ 1: ప్రతి విద్యార్థి భగవద్గీత శ్లోకాలను నేర్చుకోవాలని, విద్యార్థుల్లో భక్తి భావం కలిగి ఉండాలని టీటీడీ, హిందూ ధార్మిక ప్రచార పరిషత్ ధర్మకర్త రామాచారి సూచించారు. ఆదివారం మండలంలోని శ్రీవాణి విద్యామందిర్ ఏర్పాటు చేసిన భగవద్గీత కంఠస్త పోటీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాల పఠనంతో వారికి ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. మొదటి, తృతీయ బహుమతులు శ్రీవాణీ విద్యామందిర్ విద్యార్థులకు, ద్వితీయ బహుమతి భారతీ స్కూల్ విద్యార్థులు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు తారకం, శ్రీశైలం, భూమానంద స్వామి, రజినీ, ఉమాదేవి, చెన్నయ్య, బాలస్వామి, గాంధీ, స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వినితమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు నాలుగు 108 వాహనాలు మంజూరు

నారాయణపేట, డిసెంబర్ 1: పేట జిల్లాకు నాలుగు 108 వాహనాలు మంజూరైనట్లు 108 జిల్లా కోఆర్డినేటర్ రాఘవేంద్ర ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఊట్కూర్, దామరగిద్ద, నర్వ, మాగనూర్ మండలాలకు నూతన అంబులెన్స్‌లు రానున్నట్లు తెలిపారు. ప్రతి అంబులెన్స్‌లో ఆరుగురు సిబ్బంది ఉంటారని, ఇప్పటికే ఆయా మండలాలకు సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

భూత్పూర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

భూత్పూర్, డిసెంబర్ 1: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 10వ, తరగతి విద్యార్థులకు 'పునరుత్పాదక శక్తి' అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉషారాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు శక్తిని మళ్లీ తయారు చేసుకొని వాటిని గూర్చి తెలియజేసే అంశంగా నిర్ణయించినట్లు తెలిపారు. మండల స్థాయిలో వ్యాసరచన విభాగంలో మౌనిక(జెడ్పీహెచ్‌ఎస్ కర్వెన), బషీరా బేగం(కొత్త మొల్గర), కవిత(కేజీబీవీ), ఉపన్యాస పోటీల్లో వైష్ణవి(ఎంజేపీ), సునీత(కేజీబీవీ), వర్షిని(ఎంజేపీ) విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఇక్రం, ఠాగూర్, నాగేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. పాయస నైవేద్యాలు

- కురుమూర్తి గిరులకు పోటెత్తిన భక్తులు
- కాంచనగుహలో కార్తీక అమావాస్య పూజలు
- ఉద్దాల మండపాన్ని దర్శించుకొని తన్మయత్వం



చౌదర్‌పల్లిలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

జాతర మైదానంలో దుకాణాల వద్ద భక్తుల సందడి

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), డిసెంబర్ 1: పాలమూరు జిల్లాలో పేదల తిరుపతిగా పేరుగాంచిన వేంకటేశ్వరస్వామి ప్రతి రుశుమైన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ మైదానంలో జాతర కొనసాగుతుంది. ఆదివారం కార్తీక అమావాస్యను పురస్కరించుకొని ఆలయ అర్చకులు నిత్యకైంకర్యాలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి తడిబట్టలతో స్వామి వారికి పాయస నైవేద్యాలు తయారు చేసి, పాయస నైవేద్యాల తోపాటు కొబ్బరి కాయలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. అలాగే ఉద్దాల మండపంలో స్వామివారి ఉద్దాలను దర్శించుకొని తన్మయత్వం చెందారు. జాతరలో మిఠాయిలు, ఆట వస్తువులు, గాజుల దుకాణాల్లో కొనుగోలు చేస్తూ సందడి చేశారు. ఆలయ సిబ్బంది, పోలీసులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

భక్తమార్కండేయస్వామికి ప్రత్యేక పూజలు

నారాయణపేట టౌన్, డిసెంబర్ 1: కార్తీక మాసం చివరి రోజును పురస్కరించుకొని పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, శివలింగానికి అభిషేకం, పల్లకీసేవ, మహామంగళహారతి నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఆలయం ఆవరణలో దీపాలు వెలిగించారు.

కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

పోలీస్ కిష్టయ్య త్యాగం మరువలేనిది

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, డిసెంబర్ 1: తెలంగాణ మలిదశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విధుల్లో ఉన్నప్పుడు తుపాకీతో కాల్చుకొని రాష్ట్ర సాధనలో అమరుడయ్యాడని ఆయన సేవలు ఎన్నటికీ మరువలేమని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి అన్నారు. పోలీస్ కిష్టయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మక్తల్ మాస్య సహకార సంఘం భవనం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధన కోసం డిసెంబర్ 01, 2009 సంవత్సరంలో కామారెడ్డి పట్టణం నడిబొడ్డున పోలీస్ కిష్టయ్య తన తుపాకితో స్వరాష్ట్ర సాధన కోసం కాల్చుకొని అమరుడయ్యాడని పేర్కొన్నారు. అలాంటి తెలంగాణ అమరుని జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నర్సింహులు, నారాయణపేట జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వాకిటి శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకులు కోళ్ల వెంకటేశ్, నర్సింహులు, వల్లంపల్లి లక్ష్మణ్, అశోక్, రవికుమార్, రేణుక నర్సింహ, కట్టా వెంకటేశ్, సుకన్య శేఖర్, కావాలి శ్రీనివాసులు, చీరల మూర్తి, తిరుపతి మూర్తి, వాకిటి వెంకటేశ్, అనపల్లి రమేశ్, శివాజీ, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీరెడ్డి , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవి కుమార్, నాగరాజ్ ఉన్నారు.



పోలీస్ కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

రైతుకు 'భరోసా' నివ్వని సీఎం

నారాయణపేట, డిసెంబర్ 1: మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు సదస్సు(రైతు పండుగ సభ)లో సీఎం ప్రసంగం రైతు భరోసాకు భరోసా ఇవ్వకుండా పోయిందని, పూర్తిస్థాయి రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా పండుగ ఎలా చేసుకుంటారని ఏఐసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి ఆదివారం సంయుక్త ప్రకటనలో ప్రశ్నించారు. రైతు సదస్సులో జిల్లాకు వరాల జల్లు కురిపిస్తాడనుకున్న ప్రజలు, రైతులకు నిరాశురచారన్నారు. బహిరంగ సభలో రైతు భరోసాపై ప్రకటన రాక పోవడంతో యాసంగి పెట్టుబడి ఎలా అని దిగులు చెందుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2లక్షల వరకు అప్పు కలిగిన వారు దాదాపు 20లక్షల మంది రైతులు ఉంటే మొత్తం మాఫీ చేయకుండా సాంకేతిక లోపాలు కారణాలు చూపుతూ 3లక్షల పైచిలుకు రైతులకు మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్ బదిలీ

మరికల్, డిసెంబర్ 1: తాసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గోపాల్‌రావు నారాయణ పేట రెవెన్యూ కార్యాలయానికి ఆర్ఐగా బదిలీ అయ్యాడు. దామరగిద్ద మండల కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న శ్రావణ్ మరికల్ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయినట్లు తాసీల్దార్ జమీల్ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఊట్కూర్, డిసెంబర్ 1 : క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని సరస్వతీ శిశుమందిర్ ప్రిన్స్‌పాల్ రోషనప్ప అన్నారు. జిల్లా స్థాయి సరస్వతీ శిశుమందిర్ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యదర్శి నర్సింహ, శిశుమందిర్ కమిటీ సభ్యులు వెంకట్‌నారాయణ, కేవన్‌రావు, జగన్నాథ్‌రావు, రాములు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం

యువకుల దాడిలో చనిపోయిన కొండచిలువ

ఊట్కూర్, డిసెంబర్ 1 : మండలకేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఆదివారం కొండచిలువ కలకలం సృష్టించింది. సుమారు ఐదు అడుగుల పొడవున్న కొండచిలువ ఇండ్ల మధ్యన ఉన్న గడ్డిపొదల్లో కనిపించడంతో మహిళలు భయంతో పరుగులు తీశారు. కొండచిలువ ఉన్న విషయాన్ని కాలనీ యువకులకు తెలుపడంతో కర్రలతో దాడిచేసి చంపారు. శ్రీరాంగనర్ కాలనీ చుట్టుపక్కల దట్టమైన పొదలు ఉండటంతో పాములు, విష కీటకాలు చేరుతున్నాయని, అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన క్రీడాకారులు

పతకాలు అందుకుంటున్న క్రీడాకారులు

నారాయణపేట, డిసెంబర్ 1: మంచిర్యాల జిల్లాలో ఆదివారం జరిగిన 10వ తెలంగాణ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పేట జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. అండర్–12 బాయ్స్ విభాగంలో 100, 400 మీటర్ల పరుగు పందెంలో శివకుమార్ బ్రాంజ్ మెడల్ సాధించగా, అండర్–12 గర్ల్స్ విభాగం షాట్‌పుట్‌లో మౌనిక సిల్వర్ మెడల్, అండర్–10 విభాగంలో లాంగ్‌జంప్‌లో గౌశిక సిల్వర్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, కోచ్ జగదీశ్, బీరప్ప అభినందించారు.

నేడు ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత

నారాయణపేట టౌన్, డిసెంబర్ 1: వాతావరణ శాఖ నారాయణపేట జిల్లాకు ఫెంగల్ తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సోమవారం మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ శివా రెడ్డిఆదివారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి కొనుగోళ్లు జరుగుతాయన్నారు. కంది కొనుగోళ్లు మాత్రం యథావిధిగా కొనసాగుతాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, డిసెంబర్ 1: విదేశాల్లో పైచదువుల నిమిత్తం జిల్లాలోని అల్పసంఖ్యాక వర్గాల వారు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రషీద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ కింద రూ.20లక్షలు రెండు విడుతల్లో చెల్లించనున్నారు. విమాన ప్రయాణ చార్జీలు రూ.60వేలు మించకుండా చెల్లించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షలు మించరాదని, ఆగస్టు నుంచి డిసెంబర్ 31కాలంలో అడ్మిషన్ తీసుకున్న వారు అర్హులని, ఆసక్తిగల అభ్యర్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారం, జత పత్రాలను జనవరి 20లోగా జిల్లా మైనార్టీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

యువతి అదృశ్యం

మూసాపేట, డిసెంబర్ 1: మండలంలోని వేములలో శనివారం ఓ యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీనివాస రామానుజన్ టాలెంట్ టెస్ట్ విజయవంతం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 1 : రామేశ్వరమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గణితం (మ్యాథ్స్) ప్రతిభ పరీక్ష విజయవంతమైందని సొసైటీ ఫౌండర్ శ్రీనివాసులు తెలిపారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 5వ, 6, 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులు 3,500 మందికి శ్రీనివాస రామానుజన్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టి పరీక్ష రాశారు. ఈ సందర్భంగా పరీక్షలు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పద్మజ, వెంకటేశ్వర్లు, ప్రతిభ, పరమేశ్, సృజన్, నితిన్, శ్రావ్య, విద్యాసాగర్, శ్రీలక్ష్మి, స్రవంతి, శ్రీకాంత్, శ్రీనివాసులు కేకేచారి పాల్గొన్నారు.

గణితం ప్రతిభ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విక్టరీ చూపుతున్న నిర్వాహకులు, విద్యార్థులు

ఎస్సీ వర్గీకరణ చేపడితే ఆందోళన ఉధృతం

నవాబ్‌పేట, డిసెంబర్ 1: ఎస్సీ వర్గీకరణ చేపడితే మాల మహానాడు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని మాజీ ఎంపీపీ, మాలమహానాడు నాయకుడు అనంతయ్య పేర్కొన్నారు. వర్గీకరణ చేపట్టవద్దని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి మాల కులస్థులు భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు రమేశ్, రాములు, రాంచంద్రయ్య, రవి, శాలయ్య, చెన్నయ్య, హన్మంతు తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన మాలలు

మరికల్, డిసెంబర్ 1: మాలల సింహగర్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలం నుంచి మాలమహానాడు నాయకులు ఆదివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పేరుతో అన్నదమ్ములుగా ఉన్న మాల, మాదగలను విడదీయాలని చూడడం తగదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఎస్సీలకు 20శాతం రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యానారాయణ, తిరుపతయ్య, వెంకటేశ్, నర్సింహులు, జనార్దన్, కోయిల కొండ రఘు, నాగరాజ్ పాల్గొన్నారు.

ఊట్కూర్ మండలంలో..

ఊట్కూర్, డిసెంబర్ 1 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టిన ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని మాల సంఘం మండల కన్వీనర్ హన్మేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు మండల వ్యాప్తంగా మాలలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో రాజప్ప, బాబేశ్, అశోక్, హన్మంతు పాల్గొన్నారు.

నవాబ్‌పేట నుంచి హైదరాబాద్ తరలుతున్న మాలమహానాడు నాయకులు

ఎస్సీ వర్గీకరణ చేయకుండా జ్యాపం చేస్తున్న ప్రభుత్వం

దేవరకద్ర, డిసెంబర్ 1: ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆదేశించినా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యాపం చేస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, బీఆర్ఎస్ మండల నాయకుడు దొబ్బలి ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని బస్వాపూర్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ దండోరాల చిరకాల కాంక్ష అయిన వర్గీకరణ 30ఏళ్ల ఉద్యమ ఫలితంగా భారత అత్యున్నత న్యాయస్థానం ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని దేశంలోని అన్ని రాష్ట్రాలకు సూచించినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడంలో జాప్యం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం వర్గీకరణ జాప్యం చేస్తుండడంతో జనవరి 19న చలో హైదరాబాద్‌లో మాదిగల మహాగర్జన సభను విజయవంత చేయాలన్నారు. దీనికి మద్దతుగా ఆ రోజు జిల్లా కేంద్రంలో నిర్వహించే స్కూటర్ ర్యాలీని విజయవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లాలోని మాదిగలు, మాదిగ ఉపకులాలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు చిన్ననర్సింహులు, మండలాధ్యక్షుడు ఎల్లస్వామి, హన్మంతు, రాజు, వీరన్న, మొగులయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

హన్వాడ, డిసెంబర్ 1: ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య అన్నారు. అదివారం మండల కేంద్రంలో జనవరి 19న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ మహాగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30ఏళ్లు మాదిగల చిరకాల అకాంక్షను సుప్రీం కోర్టు న్యాయ స్థానం ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, మాజీ ముడా డైరెక్టర్ బాలయ్య, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రావుల శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి నరేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యాదయ్య, నాయకులు మాలకిష్టయ్య, బాలయ్య, ఆంజనేయులు, గంగన్న, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

హన్వాడలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు